నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | శుక్రవారం 2 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

భూపాలపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆడబిడ్డలకు అవమానంపై ఆగ్రహజ్వాల

సీఎం, డిప్యూటీ సీఎం అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్ఎస్

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటిన నిరసనలు
- రేవంత్ దిష్టిబొమ్మల దహనం
- హనుమకొండలో నిప్పంటుకొని మహిళా కార్యకర్తకు గాయాలు
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఆడబిడ్డలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ సీనియర్ మహిళా శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని కించపరిచేలా మాట్లాడిన సీఎంకు వ్యతిరేకంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం నిరసనలు మిన్నంటాయి. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. పలుచోట్ల దహనాన్ని పోలీసులు అడ్డుకోగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 1

- హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్, మహిళలకు క్షమాపణ చెప్పాలని అంటూ నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు యత్నించగా కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టు వదలని బీఆర్ఎస్ శ్రేణులు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో అక్కడున్న మహిళా కార్యకర్తకు నిప్పంటుకొని స్వల్ప గాయాలయ్యాయి. అలాగే జిల్లాలోని పరకాల, ఎల్కతుర్తి, వేలేరు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టి సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. వేలేరులో దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు.
- జనగామ జిల్లాలోని జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని పలు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. జనగామ చౌరస్తాలో మహిళలు, పార్టీ శ్రేణులు ర్యాలీగా వచ్చి సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ నాయకుల చేతుల్లో ఉన్న బొమ్మను లాగేసుకునే ప్రయత్నంలో జరిగిన పెనుగులాట కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది.
- వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వర్ధన్నపేట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి. నర్సంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేయగా, వరంగల్ చౌరస్తాలో తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
- మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు బస్టాండ్ ఎదుట సీఎం చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీని, పెద్దవంగర మండల కేంద్రంలో దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం దిష్టి బొమ్మను దహనం చేశారు. వెంటనే రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

తొర్రూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన నాయకులు, కార్యకర్తలు

హనుమకొండలో ధర్నా చేస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

నర్సంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

మహబూబాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిండు శాసనసభలో సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరైంది కాదని, ఆడబిడ్డలంటే అంత అలుసెందుకన్నారు. అసెంబ్లీలో ఆడబిడ్డల ఆత్మగౌరవంపై ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెప్తారని కవిత పేర్కొన్నారు.

బచ్చన్నపేటలో రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కాలేజీలో ధ్వంసమైన ఫర్నిచర్, పూల కుండీలు

విద్యార్థిని భవాని(ఫైల్)

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- వైబ్రెంట్ కళాశాలలో ఘటన
- కాలేజీ ఎదుట కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల ధర్నా
- ఫర్నిచర్, పూలకుండీలు ధ్వంసం

హనుమకొండ/మంగపేట, ఆగస్టు 1: హనుమకొండ నక్కలగుట్టలోని వైబ్రెంట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీంతో గురువారం కుటుంబసభ్యులు, డీవైఎఫ్ఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాలేజీ ఎదుట ధర్నా చేపట్టారు. కోపోద్రిక్తులైన వారు ఫర్నిచర్, పూలకుండీలను ధ్వంసం చేశారు. విద్యార్థిని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ పంచాయతీ పరిధి గుడ్డేలుగులపల్లికి చెందిన ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకుడు ఎనుముల జనార్దన్‌రెడ్డి-సుమత దంపతుల కూతురు భవాని(15) హనుమకొండలోని వైబ్రెంట్ అకాడమీలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్ చదువుతోంది. గత నెల 15న హోమ్ సిక్ హాలీడేస్‌కు వచ్చిన ఆమె తిరిగి 24న కాలేజీకి వచ్చింది. ఏమైందో ఏమోకాని బుధవారం రాత్రి 11.30 గంటలకు వార్డెన్ ఫోన్ చేసి భవాని కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోందని, రోహిణి ఆసుపత్రికి తీసుకెళ్తున్నామని, మీరు వెంటనే రావాలని కుటుంబసభ్యులకు తెలిపారు. వారు రాత్రి వచ్చే సరికి 'మీ కూతురు చనిపోయింది.. ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించాం' అని చెప్పారు. తమ కూతురుకు ఆరోగ్య సమస్యలు లేవని, దేనికీ భయపడే పిరికిది కాదని, ఎందుకు ఉరివేసుకుందో తెలువదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. కళాశాల యాజమాన్యం ఒత్తిడి, నిర్లక్ష్యంతో చనిపోయిందని బోరున విలపించారు. విద్యార్థిని మృతిపై కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. న్యాయ విచారణ జరపాలని, అకాడమీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసులు భారీగా చేరుకున్నారు. కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాలు, కళాశాల యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి పూర్తిస్థాయి విచారణ చేస్తామన్నారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు.

కాలేజీకి అనుమతుల్లేవు: డీఐఈవో

హనుమకొండ చౌరస్తా: వైబ్రెంట్ జూనియర్ కాలేజీకి అనుమతుల్లేవని డీఐఈవో ఏ గోపాల్ తెలిపారు. నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీని హనుమకొండకు షిఫ్ట్ చేశారని, కార్పొరేట్ అకాడమీల పేరుతో ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహించడం బోర్డు నిబంధనలకు విరుద్ధమన్నారు. విద్యార్థి మృతి చెందిన కాలేజీని సందర్శించి జరిగిన ఘటనను తెలుసుకున్నట్లు చెప్పారు. కాలేజీకి షోకాజ్ నోటీసులు జారీ చేశానని, రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని యజమాన్యాన్ని ఆదేశాలు జారీ చేసినట్లు డీఐఈవో పేర్కొన్నారు.

ఆర్ఎంపీలు మందులు రాయొద్దు

- ప్రత్యక్షంగా రోగులను పరీక్షించొద్దు
- క్లినిక్‌కు తాళం వేసిన ములుగు డీఎంహెచ్‌వో

ఆర్ఎంపీ క్లినిక్‌కు తాళం వేస్తున్న అప్పయ్య

గోవిందరావుపేట, ఆగస్టు 1 : ప్రత్యక్షంగా రోగులను పరీక్షించొద్దని, మందులు రాయకూడదని ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆర్ఎంపీలను హెచ్చరించారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో గురువారం ఆర్ఎంపీ క్లినిక్‌కు ఆయన తాళం వేశారు. జ్వరాల సాకుతో ఆర్ఎంపీలు ప్రజలను ఆర్థికంగా కుంగదీస్తున్నారనే సమాచారం మేరకు క్లినిక్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి నుంచి వినాయక ల్యాబ్‌ను తనిఖీ చేసి పరీక్షల ఫీజుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆర్ఎంపీ నాగరాజు పరీక్షలు చేస్తూ మందులు రాస్తుండడంతో అతడిని బయటకు పంపించి తాళం వేసినట్లు తెలిపారు. మెడికల్ షాపు ముందు, వెనకాల ఆర్ఎంపీలతో క్లినిక్‌లు నడిపిస్తే సంబంధిత షాపుల లైసెన్స్‌ల రద్దుకు డ్రగ్ కంట్రోల్ ఆఫ్ తెలంగాణకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. ల్యాబ్‌లలో పరీక్షల వివరాలు, ఫీజు గోడలపై ప్రదర్శించాలని, లేని పక్షంలో నోటీసులు జారీ చేస్తామన్నారు.

కేయూ మొదటి గేటు వద్ద వాహనాలను పంపిస్తున్న నూతన సెక్యూరిటీ సిబ్బంది

కేయూలో పొంగులేటి పెత్తనం

- కొత్తగూడేనికి చెందిన తన అనుచరుడికి సెక్యూరిటీ ఏజెన్సీ
- ఇక్కడి వారిని తొలగించడంపై సిబ్బంది మండిపాటు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 1: కాకతీయ యూనివర్సిటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పెత్తనం చెలాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తన అనుచరుడికి చెందిన కొత్తగూడెం ఏజెన్సీకి సెక్యూరిటీ సర్వీసెస్‌ను అప్పనంగా అప్పగించడం, ఉన్నవారిని తొలగించడంపై సిబ్బంది మండిపడుతున్నారు. ఇన్నేళ్లు ఒకే ఏజెన్సీకి ఎలాంటి టెండర్లు, నోటిఫికేషన్లు ఇవ్వకుండా వర్సిటీ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో ఇప్పుడు ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు నూతన సెక్యూరిటీ ఏజెన్సీకి అందజేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాకతీయ యూనివర్సిటీలో సెక్యూరిటీ సర్వీసెస్ కోసం దేశవ్యాప్తంగా ఈప్రొక్యూర్‌మెంట్ ద్వారా అతితక్కువగా బిడ్ చేసిన కొత్తగూడెం పాల్వంచకు చెందిన ఐడీఎస్ఎస్ ఏజెన్సీకి అప్పగించినట్లు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇందులో 133 సెక్యూరిటీ గార్డ్‌లు, ఆరుగురు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు ఉన్నారు. మొదటి సారిగా మహిళా సెక్యూరిటీలను కూడా నియమించారు. ఆగస్టు 1 నుంచి వీరు విధుల్లో చేరాల్సి ఉండగా మొదటి రోజు 40 మంది వచ్చారు. సిబ్బందిని సైతం సెక్యూరిటీ ఏజెన్సీ ఖమ్మం వారిని నియమించినట్లు సమాచారం. దేశంలో ఎన్నో సెక్యూరిటీ ఏజెన్సీలు ఉన్నా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇలాకాకు చెందిన వారికే రావడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

గొత్తికోయగూడెంలో ఫీవర్ సర్వే

- నర్సింహులపేటలో వైద్యశిబిరం
- జ్వర బాధితులకు పరీక్షలు

నర్సింహులపేటలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ సుధీర్‌రెడ్డి

ఏటూరునాగారం : రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సింహులపేట / ఏటూరునాగారం ఆగస్టు 1 : సీజనల్ వ్యాధులతో పల్లె జనం పడుతున్న ఇబ్బందులపై గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'పల్లెకు జ్వరం.. వైద్యం దూరం' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈమేరకు నర్సింహులపేట మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో డీపీఎంవో సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అలాగే నర్సింహులపేటతో పాటు కొమ్ములవంచలో జ్వర బాధితులకు వైద్య పరీక్షలు చేశారు. కొమ్ములవంచలో డెంగీ లక్షణాలతో ఒకరు వరంగల్‌లో వైద్యం పొందుతున్నారని, అతడితో పాటు గ్రామంలో చాలామంది జ్వర బాధితులు ఉన్నట్లు గుర్తించామని ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం విజయ తెలిపారు. శుక్రవారం కూడా వైద్య శిబిరం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈయూవో రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ అన్వేశ్, ఏఎస్ఎం ప్రసన్న, కృష్ణవేణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. అలాగే ఏటూరునాగారం మండలం చింతలమోరి గొత్తికోయగూడెంలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ అన్మిషా ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేసి నలుగురు జ్వర పీడితులు ఉన్నట్లు గుర్తించారు. వారికి మలేరియా పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రతి ఇంటికి దోమతెరలు అందించి వాటిని వాడే పద్ధతిని వివరించారు. పబ్లిక్ హెల్త్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని దగ్గు, జలుబు ఉన్న వారికి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఆశ కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే పాలంబాట

- రైతులు మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి
- 'పాలం బాట'లో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

దామెర : దుర్గంపేటలో జరిగిన పాలంబాటలో మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

దామెర/వెంకటాపూర్, ఆగస్టు 1 : రైతులందరూ మోటర్లకు నాణ్యమైన కెపాసిటర్లను అమర్చుకోవాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని దుర్గంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో జరిగిన పాలం బాటలో సీఎండీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన కెపాసిటర్లు వాడడం ద్వారా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవని, మోటర్లపై భారం పడదని తెలిపారు. రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పాలం బాట చేపట్టామన్నారు. మోటర్ దగ్గర ఎర్తింగ్ సరిగ్గా ఉందో లేదో ప్రతి రైతు చూసుకోవాలని, సర్వీస్ వైరు అతుకులు లేకుండా ఉండాలన్నారు. ఇనుప డబ్బాలకు బదులుగా ప్లాస్టిక్ డబ్బాలు వాడితే ఇండక్షన్ వచ్చే ప్రమాదం ఉండదన్నారు. రైతులు మోటర్‌ను ప్లాస్టిక్, కర్రతోనే ఆన్ చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో స్వయంగా ఫ్యూజ్ వైరు మార్చడం, ఇతర విద్యుత్ పనులు చేయొద్దని కోరారు. సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈ కిషన్, ఎస్ఈలు వెంకటరమణ, మల్చూర్, డీఈలు సామ్యానాయక్, నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌చారి, సదానందం, ఏడీఈలు దేవేందర్, సందీప్ పాటిల్, స్వామిరెడ్డి, ఏఈలు గుర్రం రమేశ్, సురేశ్, వేణుగోపాల్, సాంబరాజు, లైన్‌మెన్ వేణు, సురేశ్ పాల్గొన్నారు.

బతుకుపోరులో వీధినబడి!

బతుకుపోరులో బాల్యం బందీ అయింది. తరగతి గదిలో పాఠాలు నేర్చుకునే వయస్సులో పొట్టకూటి కోసం ఇలా వీధినపడింది. తోటి విద్యార్థులతో స్వేచ్ఛగా గడపాల్సిన ఈ ఇద్దరు పిల్లలు ఇలా రోడ్డపై కనిపించారు. ఇక్కడ సైకిళ్లకు సంచులు తగిలించుకొని బాలకార్మికులు వెళ్తుంటే అదే సమయంలో అక్కడ పాఠశాల విద్యార్థులు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తూ కనిపించారు. ఈ దృశ్యం హనుమకొండ నక్కలగుట్టలో కనిపించింది.

- గొట్టె వెంకన్న, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్